విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు
ఎడిటర్
చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 32 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | 16 గురువారం మే 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE -32 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 16 THUSDAY MAY 2024 | PAGES : 8 | Rs :2-00

# వైఎస్ జగన్ ఇంట్లో ముగిసిన 41 రోజుల రాజశ్యామల చండీయాగం..!

అమరావతి :ఏపీలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దీంతో ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన సీఎం జగన్ ఇప్పుడు కాస్త విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎల్లుండి విదేశాలకు వెళ్లేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ దేశాల్లో పర్యటన కోసం సీబీఐ కోర్టు అనుమతి కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 41 రోజులుగా తన ఇంట్లో నిర్వహిస్తున్న యాగాన్ని కూడా పూర్తి చేశారు. తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో గత 41 రోజులుగా రాజశ్యామల చండీయాగం జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహిస్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి రావాలని, ప్రజాహిత పాలన కొనసాగాలని కోరుతూ ఈ యాగం నిర్వహిస్తున్నారు. 41 రోజులుగా జరుగుతున్న ఈ యాగాన్ని ఇవాళ ముగించారు. ఈ రాజశ్యామల సహస్ర చండీయాగాన్ని నల్లపెద్ది శివరామప్రసాదశర్మ, గౌరావర్జుల నాగేంద్రశర్మ నిర్వహించారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో 41 రోజుల పాటు యాగం 45 మంది వేద పండితులు ఇందులో



పాల్గొన్నారు. ఇవాళ ముఖ్యమంత్రి నివాసంలో పూర్ణాహుతికి ఉపయోగించే ద్రవ్యాలకు సీఎం వైయస్.జగన్‌తో షోడషోపచార పూజలు చేయించిన వేద పండితులు…అనంతరం ముఖ్యమంత్రికి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో చండీయాగ నిర్వాహకులు అరిమండ వరప్రసాదరెడ్డి, విజయశారదరెడ్డి దంపతులు, పడమట సురేష్‌బాబు పాల్గొన్నారు.

# సీఏఏ అమల్లోకి వచ్చాక తొలిసారి 14 మందికి భారత పౌరసత్వం

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం 'పౌరసత్వ సవరణ చట్టం-2019 ' అమలు ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నవారికి తొలి విడతలో 14 మందికి భారత పౌరసత్వం మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర హెూంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా దిల్లీలో వారికి సీఏఏ కింద జారీ అయిన పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. దేశంలో సీఏఏ అమలుపై ఈ ఏడాది మార్చిలో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. 2019 డిసెంబర్‌లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య సీఏఏ చట్టం-2019 పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదం పొందగా.. దీనికి రాష్ట్రపతి సమ్మతి కూడా లభించింది. సీఏఏ చట్టం ప్రకారం.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరమే భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా కేంద్రం నిబంధనల్ని రూపొందించింది. 2014 డిసెంబరు




31 కంటే ముందు ఈ మూడు దేశాల నుంచి మన దేశానికి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు ఇవి వర్తిస్తాయి. దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ముగుస్తుంది.

# నాలుగు దశలు దాటాక ఇండియా కూటమి బలపడింది: ఖర్గే



న్యూఢిల్లీ : నాలుగు దశల ఎన్నికలు ముగిసేసరికి విపక్ష ఇండియా కూటమి బాగా బలపడిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి ఆయన లఖ్‌నవూలో జరిగిన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే ప్రతీ పేదవాడికి 10 కిలోల రేషన్ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. "నాలుగు దశల ఎన్నికలు పూర్తయ్యాయి. ఇండియా కూటమి చాలా బలపడింది. జూన్ 4వ తేదీన ప్రజలు మోదీని సాగనంపేందుకు సిద్ధమయ్యారు. మా కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడటానికి ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవి. మీ భావజాలానికి తగిన నాయకుడిని ఎన్నుకొనే అవకాశం ఎక్కడుంది. ఎవరైనా పెద్ద భాజపా నాయకుడు పోటీ చేస్తుంటే.. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ వేయకుండా అడ్డుకొంటున్నారు. హైదరాబాద్‌లో ఓ మహిళా అభ్యర్థి బురా?లు తీయించి ఓటర్లను పరీక్షిస్తోంది. దీనిని ఎన్నికలు స్వేచ్ఛగా జరగడం అంటామా..?" అని ఖర్గే ఆవేదన వ్యక్తంచేశారు. సమాజ్‌వా దీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమి యూపీలో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. "మీడియాకు జూన్ 4 నుంచి స్వర్ణయుగం ప్రారంభం కానుంది. భాజపా తన ప్రతికూల ప్రచారంలో తానే ఇరుక్కొంది. ఇండియా బ్లాక్ కూటమి యూపీలో 79 స్థానాల్లో విజయం సాధించనుంది" అని పేర్కొన్నారు.

# ఏపీలో హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం.. సీఎస్, డీజీపీకి సమన్లు

అమరావతి: పల్నాడు, చంద్రగిరి సహా పలు హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు ఈసీ సమన్లు జారీ చేసింది. పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలపై వివరణ కోరింది. వ్యక్తిగతంగా ఎన్నికల కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని సీఎస్, డీజీపీని ఆదేశించింది. ఈసీ ఆదేశాలతో సీఎస్, డీజీపీ గురువారం దిల్లీ వెళ్లి వివరణ ఇవ్వనున్నట్లు సమాచారం. ఏపీ వ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనలపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతో ఈసీ స్పందించింది.

**చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం..**

పోలింగ్ అనంతరం మంగళవారం తాడిపత్రి, తిరుపతి, కారంపూడి రణరంగంగా మారాయి. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఆవరణలో వైకాపా నాయకులు మారణాయుధాలతో రెచ్చిపోయారు. ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించేందుకు వచ్చిన చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం చేశారు. చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. ఆయన కుమారుడు, ప్రస్తుతం పార్టీ అభ్యర్థి మోహిత్‌రెడ్డిల అనుచరులు సమ్మెట, కర్రలు, రాళ్లు, బీరు సీసాలతో దాడులు చేస్తూ వీరంగం సృష్టించారు. నానితోపాటు ఆయన డ్రైవర్, గన్‌మెన్లపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. తేరుకునేలోగానే దుండగులు దాడి చేయడంతో గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. వెరవకుండా వైకాపా మూకలు దాడిని కొనసాగించడంతో నాని భుజానికి గాయాలయ్యాయి. గన్‌మెన్




తలకూ తీవ్రగాయమైంది.

**కారంపూడిలో విధ్వంస కాండ...**

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడిలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులతో విధ్వంసం సృష్టించారు. తన కారుపై ఎవరో రాయి వేశారనే నెపంతో తెదేపా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కారంపూడి మీదుగా వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌లోని ఓ కారుపై గుర్తుతెలియని వ్యక్తి రాయి విసిరాడనే నెపంతో ఆగ్రహంతో ఊగిపోయారు. సమీపంలోనే ఉన్న తెదేపా కార్యాలయం వైపు కాన్వాయ్ వెళ్లి ఆగింది. కార్లలో ఉన్న వైకాపా గూండాలు కర్రలు, కత్తులు, రాడ్లు బయటకు తీసి తెదేపా కార్యాలయంలోకి దూసుకెళ్లారు. కుర్చీలను పగలగొట్టారు. రాళ్లు విసిరారు. ఫ్లెక్సీలను చించేశారు. తలుపులు ధ్వంసం చేశారు. అటుగా కారులో వెళ్తున్న తెదేపా కార్యకర్త మస్తాన్ జానీబాషా కుమారుడు బుడ్డు, షేక్‌జాన్‌ను అడ్డుకున్నారు. వారిని బయటకు రప్పించి దాడి చేసి, ఆపై కారుకు నిప్పుపెట్టారు. రోడ్లపై తిరుగుతూ బీభత్సం సృష్టించారు. దుకాణదారులపైనా దాడులకు తెగబడ్డారు. పున్నమ్మ తోపుడు (టిఫిన్ అమ్ముకునే)బండిని విరగ్గొట్టారు. అక్కడే కూర్చొని ఉన్న ఆమె కుమార్తె, మనవరాలిపై దాడి చేశారు.

**యుద్ధభూమిగా తాడిపత్రి..**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్నికల ముందు అన్నట్లుగానే విధ్వంసకాండను సృష్టించారు. తాడిపత్రిని యుద్ధభూమిగా మార్చారు. తాడిపత్రిలోని చింతలరాయుని పాళెంలో ఉన్న వైకాపా ఏజెంట్లు సంజీవ, అజయ్, మరో నలుగురు కలసి తెదేపా ఏజెంట్ భాను, ఆ పార్టీ వర్గీయుడు మోహన్‌లపై దాడికి దిగారు. అంతలో తెదేపా నాయకుడు సూర్యముని అనుచరులు వైకాపా ఏజెంట్ సంజీవను నిలదీయగా అతను ఎమ్మెల్యే పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఎమ్మెల్యే ఆవేశంతో ఊగిపోయి నా వర్గీయుడినే ప్రశ్నిస్తారా? అని తన అనుచరులతో సూర్యముని ఇంటి వద్దకు వెళ్లి రాళ్లదాడికి దిగారు. స్పెషల్ కమాండెంట్ శ్రీనివాసరావు.. బలగాలతో వెళ్లి అల్లరి మూకలను చెదరగొట్టారు. వైకాపా మూకల దాడిలో ఆయనతోపాటు పట్టణ సీఐ మురళీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఈ విషయం తెలియగానే మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూర్యముని ఇంటి వద్దకు వచ్చి పరామర్శించారు. ఆ తర్వాత తెదేపా వర్గీయులు పెద్దారెడ్డి అరాచకాన్ని నిరసిస్తూ రాస్తారోకో చేశారు. అనంతరం అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోకి చేరుకోగా, అక్కడ దాడికి పక్కా వ్యూహంతో ఉన్న వైకాపా వర్గీయులు ట్రాక్టర్లతో రాళ్లను తెప్పించుకుని తెదేపా వారిపైకి విసిరారు. తెదేపా వర్గీయులపై బాణసంచా పేల్చారు. కేంద్ర బలగాలు రంగ ప్రవేశం చేసి అల్లరి మూకలను చెదరగొట్టాయి.

# 400 సీట్లు గెలిస్తే.. భారత్‌లో పీవోకే విలీనం ఖాయం




దిల్లీ: కేంద్రంలో మరోసారి భాజపా అధికారంలోకి వస్తే మోదీ సర్కార్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాషాయ పార్టీ 400 సీట్లు గెలిస్తే.. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) భారత్‌లో విలీనం ఖాయమని అన్నారు. అంతేకాకుండా.. బాబా విశ్వనాథ ఆలయాన్ని నిర్మిస్తామని కూడా చెప్పారు. దిల్లీలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న బిశ్వశర్మ ఈ వ్యాఖ్యలు చేశారు. "డబుల్, ట్రిపుల్ సెంచరీలు ఎందుకు చేశారని సచిన్ తెందూల్కర్‌ను అడిగితే ఈ ప్రశ్నకు సమాధానం ఉండదు. అదేవిధంగా గత లోక్‌సభ ఎన్నికల్లో 300 సీట్లతో గెలుపొందిన భాజపా.. అయోధ్యలో రాముడి ఆలయాన్ని నిర్మించింది. ఈ ఎన్నికల్లో ఒకవేళ 400 సీట్లు సొంతం చేసుకుంటే శ్రీ కృష్ణుడి జన్మస్థలం మథురలో దేవాలయాన్ని, వారణాసిలో బాబా విశ్వనాథ ఆలయాన్ని నిర్మిస్తుంది. దీంతో పాటు పీవోకేను భారత్‌లో విలీనం చేసేందుకు కృషి చేస్తుంది" అని హిమంత బిశ్వశర్మ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో పీవోకే అంశంపై పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరగలేదని ఆ పార్టీపై హిమంత విమర్శలు గుప్పించారు.

**ఆ విషయంలో సందేహం లేదు: అమిత్ షా**

మరోవైపు పీవోకేలో ప్రస్తుతమున్న పరిస్థితిపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. 'ఆర్టికల్ 370 రద్దు తర్వాత పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శాంతి నెలకొంది. కానీ, ప్రస్తుతం అక్కడ నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఆజాదీ నినాదాలు వినిపిస్తున్నాయి. త్వరలో పీవోకే భారత్‌లో విలీనం అవుతుందనడంలో సందేహం లేదు. దాన్ని తిరిగి మన దేశంలో కలిపేందుకు కృషి చేస్తాం" అని షా పేర్కొన్నారు.

**ఇదేమీ అతిశయోక్తి కాదు: జై శంకర్**

"పీవోకేలో తీవ్ర దుమారం చెలరేగుతోంది. సోషల్ మీడియా, టీవీల్లో వాటిని చూస్తున్నాం. అక్కడి పరిస్థితులను విశ్లేషించడం కష్టమే. కానీ.. అక్కడ నివసిస్తున్నవారంతా జమ్మూలో ఉంటున్న వారితో తమ పరిస్థితిని పోల్చుకుంటున్నారు. ఈ విషయం నిజమని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అక్కడ జరుగుతోన్న అభివృద్ధిని ప్రజలంతా కళ్లారా చూస్తున్నారు" అని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ పేర్కొన్నారు.

# 'కడుపులో పిండానికీ జీవించే హక్కు'

న్యూఢిల్లీ : నెలలు నిండుతోన్న గర్భాన్ని తొలగించే అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తల్లి కడుపులోని పిండానికీ జీవించే ప్రాథమిక హక్కు ఉందని స్పష్టం చేసింది. 27 వారాల గర్భాన్ని తొలగించాలంటూ 20 ఏళ్ల అవివాహిత చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన న్యాయస్థానం ఇలా స్పందించింది. 'గర్భం దాల్చి ఏడు నెలలు పూర్తి కావొస్తోంది. చిన్నారి మనుగడ మాటేమిటీ? ఆ సమస్యను ఎలా పరిష్కరిస్తారు? తల్లి కడుపులోని పిండానికీ జీవించే ప్రాథమిక హక్కు ఉంది. దాని గురించి ఏం చెబుతారు?' మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారం.. పిండంతోపాటు తల్లి కూడా పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆ గర్భాన్ని కొనసాగించేందుకు మహిళకు ఎటువంటి ప్రమాదం లేదు.

# కడప లోక్ సభ సీటులో క్రాస్ ఓటింగ్ ? షర్మిలకే టీడీపీ ఓట్లు.. !



కడప: ఏపీలో ఈసారి ఎన్నికల్లో అత్యంత ఉత్కంఠ రేపిన నియోజకవర్గాల్లో కడప లోక్ సభ స్థానం కూడా ఒకటి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య దర్యాప్తును అడ్డుకుంటున్నారన్న కారణంతో అన్న జగన్ పైనే వార్ ప్రకటించిన పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల. తనకు పట్టున్న కడప లోక్ సభ సీటులో పోటీకి దిగారు. అక్కడ వరుసగా రెండుసార్లు గెలిచి హ్యాట్రిక్ కోసం చూస్తున్న వివేకా కేసు నిందితుడు, తన సోదరుడూ అయిన వైఎస్ అవినాష్ రెడ్డిని ఎలాగైనా ఓడించాలనే కోరికతో షర్మిల పోటీ చేశారు. కడప లోక్ సభ సీటుకు ఈసారి జరిగిన ఎన్నికల్లో అన్ని అజెండాలూ పక్కకుపోయి వివేకా హత్య ప్రధాన అజెండాగా మారిపోయింది. న్యాయం కోసం వివేకా కుమార్తె చేస్తున్న పోరాటానికి తోడైన వైఎస్ షర్మిల.. వ్యూహాత్మకంగా ఈ సీటులో పోటీకి దిగడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఈ క్రమంలో వివేకా హత్య కేంద్రంగా షర్మిల, సునీత గుప్పించిన విమర్శలు ఓ దశలో పతాకస్థాయికి చేరుకున్నాయి. వీటిని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కడప కోర్టును ఆశ్రయించి గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో కొంగుచాచి ఓటు అడుగుతున్నా, న్యాయం చేయాలంటూ వివేకా కుమార్తెతో పాటు షర్మిల చేసిన వ్యాఖ్యలు అసలే సెంటిమెంట్ ఎక్కువగా ఉండే సీమ ఓటర్లను ఎక్కడో తాకినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీలకు అతీతంగా రష్మిలకు ఈసారి ఓటు వేసి గెలిపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా జరిగిన పోలింగ్ సరళిని దగ్గరిగా గమనించిన వారు, ఇంకా చెప్పాలంటే ఓటేసిన వారు సైతం ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా జగన్ కు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ సైతం తమ అభ్యర్థి భూపేష్ రెడ్డిని కాదని ఈసారికి షర్మిలకే ఓటేయాలని క్యాడర్ కు సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ క్యాడర్ అంతా ఎమ్మెల్యే ఓటును తమ అభ్యర్థులకు వేసి ఎంపీ ఓటు మాత్రం షర్మిలకే వేసినట్లు సమాచారం. అయితే ఇంత చేసినా రేపు షర్మిల కచ్చితంగా గెలుస్తుందని చెప్పలేని పరిస్థితి. ఎందుకంటే కడప జిల్లాలో సంప్రదాయంగా వైసీపీకి ఉన్న ఓటు బ్యాంకే కారణం.

# వైకాపా నేతలను ఓటమి భయం నరరూప రాక్షసులుగా మార్చింది



అమరావతి: ఓటమి భయం వైకాపా నేతలను నరరూప రాక్షసులుగా మార్చేసిందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. తెదేపాకు ఓటు వేశారనే అనుమానంతో పెళ్లకూరుమిట్టకు చెందిన గర్భిణిపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నచ్చినట్లు ఓటు వేసే స్వేచ్ఛ కూడా లేకుండా చేసిన వైకాపా పతనం ఖాయమన్నారు. గర్భిణికి మెరుగైన వైద్యం అందించి నిందితులను అరెస్టు చేయాలని లోకేశ్ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా పెళ్లకూరుమిట్టకు చెందిన గర్భిణి అరుణ తెదేపాకు ఓటేశారన్న అక్కసుతో వైకాపా నేత, ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వర్గీయులు ఆమెపై దాడికి తెగించారు. అరుణ మంగళవారం ఇంటి వద్ద ఉండగా ఇదే ప్రాంతానికి చెందిన కామిరెడ్డి అనుచరులు ఆమె పొట్టపై కాళ్లతో తన్ని దాడి చేశారు. 'మా పెద్దాయనకు ఎదురుతిరిగి ఎక్కడినుంచో వచ్చి తెదేపాకు ఓటేస్తావా?' అంటూ దూషించారు. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి పంపారు. వైఎస్ఆర్ జిల్లాలో ఉంటున్న ఆమె ఓటేయడానికి పుట్టింటికి వచ్చారు. దాడిపై ఫిర్యాదు తీసుకున్న పోలీసులు సాయంత్రం వరకు కేసు నమోదు చేయలేదు.

ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఎడిటోరియల్

## సత్యాన్వేషణలో రాహుల్ గాంధీ!

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకై ఎంతో శ్రమించినప్పటికి ఫలితాలు ఆ పార్టీకి అనుకూలంగా రాకపోవడంపై అధ్యయనం చేసిన రాహుల్ గాంధీకి బలమైన సైద్ధాంతిక భూమిక అవసరమన్న విషయం బోధపడింది.అందుకే అప్పటి నుండి అంబేద్కర్ ఇజం, మార్క్సిజం, బుద్దిజంపై అవగాహన పెంచుకున్నారు. ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీ వాటిని ప్రజల్లో ఆచరణలో పెట్టడం ప్రారంభించాడు. అందులో భాగమే భారత్ జోడో యాత్ర.ఈ ఎన్నికల కోసం రాహుల్ గాంధీ.. ప్రగతిశీల, సామ్యవాద, సిద్ధాంతాల భూమికతో పార్టీని నిర్మాణం చేయాలన్న దృక్పథంతో ముందుకు వెళ్లారు. బీజేపీ హిందుత్వ సిద్ధాంతానికి దేశీయ కోణంలో విరుగుడు కనిపెట్టే పనిలో రాహుల్ గాంధీ రహస్య విప్లవ నిర్మాణానికై అన్వేషణ మొదలు పెట్టాడు. ఈ అన్వేషణ విజయాన్ని ముద్దాడే రోజు ఈ దేశం నూతన రాజకీయ అధ్యాయంలోకి అడుగుపెడుతుంది.

వామపక్ష భావం బలంగా ఉన్నా..

ఒక సిద్ధాంతాన్ని నమ్ముకొని నిలబడటం ఆచరించడం, నిర్మాణం చేయడం అనేది మామూలు విషయం కాదు. భారత సమాజంలో భావజాల ధార అనేది ప్రజలని ప్రభావితం చేసే ప్రధానమైన అంశం. ఇప్పటి ఆధునిక కాలమే కాదు అనాది కాలం నుండి అనేక తర్కాల మధ్య ఘర్షణ, చర్చ అనేది చూస్తూనే ఉన్నాం. సనాతన, బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ, గాణపత్య, శాక్తేయ, ఇలా శాకోపశాకలుగా అనేక భావజాల జీవదారాలు ఈ నేలను సుసంపన్నం చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఆధునిక నాగరిక సమాజంలో అనేక రాజకీయ పార్టీలు తన విచారధారను ప్రజల ముందు ఉంచుతున్నాయి. దేశ స్వాతంత్ర అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా దేశభక్తి, ప్రగతిశీల లౌకిక వాదాన్ని తన సిద్ధాంతాలుగా ప్రజల ముందు పెట్టింది. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా వామపక్ష వాదం బలంగా ఉండటం. అనేక దేశాలు కమ్యూనిజాన్ని ఆశ్రయించడం.. చైనా, రష్యా, యూరప్ అంత వామపక్ష భావజాలంలోకి వెళ్లడంతో సహజంగానే ఆ ప్రభావం భారత్ పైన పడింది. కానీ మనదేశంలో గాంధీ ఇజం బలమైన ప్రభావం చూపడంతో ఇక్కడ వామపక్ష ప్రభావం నిర్ణయాత్మక శక్తిగా ఎదగలేక పోయింది. నెహ్రూ, గాంధీ ఇజానికి తోడు నెహ్రూ ఆధునిక భావజాలం, ప్రగతిశీల సోషలిస్టు భావజాలం దేశ ప్రజలను ఆకట్టుకుంది. గాంధీ దేశీయ ఆలోచన పండిట్ నెహ్రూ అంతర్జాతీయ సోషలిస్టు భావజాలం కలగలిపి భారత పునర్నిర్మాణానికి దోహదపడింది.

మునుపెన్నడూ లేని సైద్ధాంతిక ఘర్షణ..

మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా లాంటి వారు గాంధీ మార్గాన్ని అనుసరించడంతో గాంధేయవాదం అంతర్జాతీయం అయ్యింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నిరసిస్తూ మతపరమైన ఏకీకరణ కోసం సాంస్కృతిక పరమైన సంస్థగా ఏర్పడిన 'ఆర్ఎస్ఎస్' అనతికాలంలోనే దేశవ్యాప్తంగా విస్తరించింది. దీనికి అనుబందంగా ఏబీవీపీ, వీహెచ్‌పీ, హిందువాహిని, విద్య, సేవ భారతి లాంటి సంస్థలు వివిధ విభాగాలపై పట్టు సాధించాయి. సంఘ్ మద్దతుదారుల కలయికతో ఆవిర్భవించిన జన సంఘ్ నుండి అనతి కాలంలోనే భారతీయ జనతాపార్టీగా ఆవిర్భవించడం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పూర్తిస్థాయి రాజకీయ విభాగంగా మారి దేశ శక్తి, హిందూత్వ ఎజెండాగా నూతన రాజకీయ సిద్ధాంతాన్ని భారత ప్రజల ముందు ఉంచారు. ఇలా బీజేపీ రాకతో రైట్ వింగ్, లెఫ్ట్ వింగ్‌ల మధ్య భావజాల ఘర్షణ మొదలైయ్యింది.అయితే ప్రస్తుతం దేశంలో మునుపు ఎన్నడూ లేని సైద్ధాంతిక ఘర్షణ భారత రాజకీయాల్లో నేడు ప్రధాన చర్చగా సాగుతున్నది. నిజానికి గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఆస్కారం లేకుండా రాజకీయాలు చేయడంతో బీజేపీ బలమైన భావజాలాన్ని ప్రజల్లో ప్రచారం చేసుకుంది. బీజేపీ హిందుత్వ వాదాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ కొంతమేర నిర్లక్ష్యం చేయడంతో బీజేపీది సైద్ధాంతికంగా పైచేయి సాధించి కాంగ్రెస్ వరుస ఓటములను చవిచూసింది.

బీజేపీ సిద్ధాంతానికి విరుగుడు కోసం..

ప్రతి ఎన్నికల కోసం రాహుల్ గాంధీ ఎంతగా శ్రమించినప్పటికి ఫలితాలు మాత్రం ఓటమి అంచుకే చేరుకునివి. గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సంక్షోభంలో జారుకోవడం సీనియర్ నేతలంతా దూరం కావడంతో ఆ పార్టీ చతికిలపడింది. అందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ద్వారా దేశంలోని ప్రగతిశీల, సామ్యవాద, సిద్ధాంతాల భూమికతో పార్టీని నిర్మాణం చేయాలన్న దృక్పథంతో ముందుకు వెళ్లారు.ఈ యాత్రలో రాహుల్ గాంధీ యోగేందర్ యాదవ్, ప్రశాంత్ భూషణ్, ప్రొ.హరగోపాల్, ప్రొ. కంచ ఐలయ్య, ప్రొ.కోదండరాం లాంటి మేధావులతో పాటు ప్రముఖ జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అవగాహన పెంచుకుంటూ ముందుకు సాగుతుండటంతో కాంగ్రెస్ మెరుగుపడుతున్న పరిస్థితి మొదలైనది. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ లాంటి రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని తెచ్చుకోగలిగింది. బీజేపీ హిందుత్వ సిద్ధాంతానికి విరుగుడు కనిపెట్టే పనిలో రాహుల్ గాంధీ రహస్య విప్లవ నిర్మాణానికై అన్వేషణ మొదలు పెట్టాడు. ఇది విజయాన్ని ముద్దాడే రోజు ఈ దేశం, నూతన రాజకీయ అధ్యాయంలోకి అడుగుపెడుతుంది. కాంగ్రెస్‌కి పూర్తిస్థాయి అధికారం కైవసం అవుతుంది. దేశ రాజకీయాల్లో భారి అవమానాలు మోసినా, మొక్కవోని దైర్యంతో ముందుకు సాగిన రాహుల్ గాంధీ గొప్ప తత్వవేత్తగా కనిపించే రోజులు సమీపంలో ఉన్నాయి. దేశ రాజకీయాలలో జరుగుతున్న సైద్ధాంతిక పోరులో ఎవరు విజయతీరాలకు చేరుతారో.. బిన్నత్వంలో ఏకత్వం ద్వారా యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా ఉన్న భారతదేశం భిన్న సిద్ధాంతాల ఘర్షణలో ఎవరిది పై చేయి అవుతుందో కాలానికి వదిలేద్దాం.

# ఎమ్మెల్యే అభ్యర్థులు డబ్బులు అడిగారన్నది అవాస్తవం.....!

ఏలూరు,: కాంగ్రెస్ పార్టీ తరపున ఏలూరు ఎంపీగా పోటీ చేసిన కావూరి లావణ్య ఎమ్మెల్యే తరపున పోటీ చేసిన అసెంబ్లీ అభ్యర్థులపై నిరూపించిలేని నిందారోపణలు చేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు హితవు పలికారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఏపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల ప్రకారం అందర్నీ కలుపుకొని అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గాలలో పనిచేస్తామని మాటిచ్చామని, అయితే ఎంపీ అభ్యర్థి అయిన కావూరు లావణ్య డబ్బులు డిమాండ్ చేశారని, కోట్ల రూపాయలు అడిగినట్లు నాపైన, అసెంబ్లీ అభ్యర్థులపై ఆరోపణలు చేయడం, ఎవరూ సహకరించలేదని ఆరోపణ చేయడంహో అవాస్తవమని ఖండించారు. అయితే ఎన్నికల ప్రచారాల్లో భాగంగా అభ్యర్థికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలోకి ఆమె వచ్చి తనతో సహకరిం చలేదని చెప్పటం విడ్డూరమ న్నారు. ఈసమావేశంలో చింతలపూడి శాసనసభ్యులు కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య తనపై చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఆమె ఒక్కరే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు గొప్పలు చెప్పడం తగదని అన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులకు ఏమాత్రం సహకరించలేదని నేరుగా అభ్యర్థులతో ఎప్పుడు ఆమె మాట్లాడలేదని ఆమెతో మాట్లాడాలంటే ఆమె పిఏనే సమాధానం చెప్తారని, ఆమె ఎంపీగా గెలిచిపోయి నట్లు ఆమె ఉన్నత స్థానంలో ఉన్నట్లు అందరు కిందిస్థాయిలో ఉన్నట్లు ఆమె వ్యవహార శైలి ఉండేదని దుయ్యబట్టారు ఇకనైనా ఆమె పద్ధతి మార్చుకోవాలని, ఆమె ఎమ్మెల్యే అభ్యర్థులకు ఒక పైసా కూడా ఇవ్వకుండా ఇచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆమె ఫోటో లేకుండా కరపత్రాలు కానీ పోస్టర్లు కానీ ముద్రించలేదని ఆమె ఫోటోతో పాటు ఆమెకుహో కూడా ఓటు వేయమని ప్రచారం నిర్వహించిన వాస్తవం తెలుసుకోవా లన్నారు. ఆమె చేసిన ఆరోపణల పట్ల ఆమె విజ్ఞతకే వదిలి వేస్తున్నామని హితవు పలికారు. ఆమెపై కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘానికి, పిసిసి అధ్యక్షురాలికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దెందులూరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య కోటి రూపాయలు బేరసారాలు చేసిన మాట వాస్తవమని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని అందుకు కోటి రూపాయల నజరానాగా ఇవ్వాలని లావణ్య అడిగిన మాట వాస్తవమనిహో నరసింహమూర్తి తెలిపారు. దానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య మంగళవారం విలేకరుల సమావేశంలో చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని నరసింహమూర్తి ఖండించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన ఆమె ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడం తగదని పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహ రించడం సరికాదని హితవు పలికారు.హో ఆమెపై జిల్లా పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పిసిసి అధ్యక్షురాలు షర్మిలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో ఎటువంటి అనుభవం లేకుండా నాలుగు నెలల ముందు వచ్చి 30 ఏళ్ల అనుభవాన్ని ప్రశ్నిం చడం ఆమె విజ్ఞతకే వదిలి వేస్తున్నామని నరసింహమూర్తి విమర్శించారు. ఆమె ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, ఎన్నికల్లో ఏ పై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు.

# పొత్తు ధర్మానికి నిదర్శనం "పిల్లి" దంపతులు



కాకినాడ రూరల్,మే 15: పొత్తు ధర్మానికి నిదర్శనం గా పిల్లి దంపతులు చరిత్రలో నిలిచిపోతారని జనసేన,బిజెపి నేతలు పేర్కొన్నారు.కాకినాడ రూరల్, కరప మండలానికి చెందిన పలువురు జనసేన,బిజెపి నాయకులు, కార్యకర్తలు వలసపాకలలోని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి నివాసం వద్ద కాకినాడ రూరల్ నియోజక వర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో చోటు చేసుకున్న విషయాలను వారితో చర్చించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు,కార్యకర్తలు ఎన్డీయే కూటమి జనసేన పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ కి సీటు కేటాయించినప్పటి నుండి ఎలక్షన్ పోలింగ్ రోజు వరకు నియోజక వర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు తమ శ్రేణులతో కలిసి ఏంతో కష్టించి కూటమి అభ్యర్థి పంతం విజయానికి బాటలు వేసారని కొనియాడారు. ఈ సందర్భంగా సమిష్టి కృషి తోనే కూటమి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ ని అత్యధిక మెజారిటీతో విజయం సాధించబోతున్నారని,ఇందుకు కృషి చేసిన తెలుగు దేశం, జనసేన,బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లాలో 83.67 శాతానికి పెరిగిన పోలింగ్

- ***పోస్టల్ బ్యాలెట్ తో మరో 1.15 శాతం పెరగనున్న పోలింగ్***
- ***జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో పెరిగిన పోలింగ్ శాతం***

ఏలూరు, మే, 15 : జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ శాతం నమోదైంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో సగటున 83.67 శాతం నమోదైంది. జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలలో 16 లక్షల 37 వేల 430 మంది ఓటర్లు ఉండగా, 13 లక్షల 70 వేల 111 (83. 67 శాతం) ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా 7 లక్షల 99 వేల 241 మంది పురుషులకుగాను 6 లక్షల 77 వేల 009 ఓట్లు నమోదుకాగా, 8 లక్షల 38 వేల 063 మంది మహిళా ఓటర్లు ఉండగా వారిలో 6 లక్షల 93 వేల 050 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 126 మంది ఉండగా వారిలో 52 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గాలుగా పరిశీలిస్తే

ఉంగుటూరు నియోజకవర్గంలో 2 లక్షల 6 వేల 437 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 81 వేల 152 (87. 75 శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా ఒక వెయ్యి 545 మంది పురుషులకు గాను 90 వేల 476 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 4 వేల 886 మంది మహిళలకుగాను 90 వేల 671 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో రెండు లక్షల 24 వేల 13 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 92 వేల 901 మంది (86. 11 శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా 8 వేల 915 మంది పురుషులకు గాను 95 వేల 360 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 15 వేల 089 మంది మహిళలకుగాను 97 వేల 533 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఏలూరు నియోజకవర్గంలో రెండు లక్షల 35 వేల 345 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 65 వేల 132 మంది (70. 17శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా 12 వేల 426 మంది పురుషులకు గాను 79 వేల 724 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 22 వేల 872 మంది మహిళలకుగాను 85 వేల 393 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పోలవరం నియోజకవర్గంలో రెండు లక్షల 53 వేల 981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 18 వేల 297 మంది (85. 95 శాతం) పోలింగ్ నమోదైంది. వీరిలో లక్షా 22 వేల 760 మంది పురుషులకు గాను లక్షా 6 వేల 151 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 31 వేల 212 మంది మహిళలకుగాను లక్షా 12 వేల 142 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

చింతలపూడి నియోజకవర్గంలో రెండు లక్షల 73 వేల 069 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 22 వేల 932 మంది (81. 64 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 34 వేల 295 మంది పురుషులకు గాను లక్షా 10 వేల 860 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 38 వేల 733 మంది మహిళలకుగాను లక్షా 12 వేల 050 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నూజివీడు నియోజకవర్గంలో రెండు లక్షల 38 వేల 981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 10 వేల 161 మంది (87. 94 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 18 వేల 104 మంది పురుషులకు గాను లక్షా 5 వేల 054 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 20 వేల 867 మంది మహిళలకుగాను లక్షా 5 వేల 105 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కైకలూరు నియోజకవర్గంలో రెండు లక్షల 5 వేల 604 మంది ఓటర్లు ఉండగా , వారిలో లక్షా 79 వేల 536 మంది (87.32 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 01 వేల 196 మంది పురుషులకు గాను 89 వేల 384 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 4 వేల 404 మంది మహిళలకుగాను 90 వేల 151 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ :** పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఇప్పటివరకు 18 వేల 201 మంది (1.15 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1614 మంది , దెందులూరు నియోజకవర్గంలో 2165 మంది, ఏలూరు నియోజకవర్గంలో 3123 మంది, పోలవరం నియోజకవర్గంలో 2872 మంది, చింతలపూడి నియోజకవర్గంలో 2267 మంది, నూజివీడు నియోజకవర్గంలో 1923 మంది, కైకలూరు నియోజకవర్గంలో 1651 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారిలో ఎన్నికల విధులకు హాజరయ్యే 15 వేల 615 మంది సిబ్బంది కాగా, 43 మంది సర్వీస్ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 85 సంవత్సరాల వయస్సు దాటినవారు 500 మంది, విభిన్న ప్రతిభావంతులు 369 మంది, అత్యవసర సర్వీస్ కు సంబందించిన సిబ్బంది 1674 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓట్లు పోలింగ్: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 16 లక్షల 37 వేల 430 మంది ఓటర్లకు గాను, 13 లక్షల 70 వేల 153 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారిలో 7 లక్షల 99 వేల 241 మంది పురుషులకుగాను, 6 లక్షల 77 వేల 056 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా, 8 లక్షల 38 వేల 063 మంది మహిళలకు గాను 6 లక్షా 93 వేల 045 మంది మహిళల తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 126 మంది ఇతరులకుగాను 52 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**పార్లమెంట్ నియోజకవర్గంలో పోలైన ఓట్లు :**

ఉంగుటూరు నియోజకవర్గంలో 2 లక్షల 6 వేల 437 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 81 వేల 152 (87. 75 శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా ఒక వెయ్యి 545 మంది పురుషులకు గాను 90 వేల 476 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 4 వేల 886 మంది మహిళలకుగాను 90 వేల 671 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో రెండు లక్షల 24 వేల 13 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 92 వేల 949 మంది (86. 11 శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా 8 వేల 915 మంది పురుషులకు గాను 95 వేల 410 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 15 వేల 089 మంది మహిళలకుగాను 97 వేల 533 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఏలూరు నియోజకవర్గంలో రెండు లక్షల 35 వేల 345 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 65 వేల 132 మంది (70. 17శాతం) పోలింగ్ నమోదైంది. లక్షా 12 వేల 426 మంది పురుషులకు గాను 79 వేల 724 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 22 వేల 872 మంది మహిళలకుగాను 85 వేల 393 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పోలవరం నియోజకవర్గంలో రెండు లక్షల 53 వేల 981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 18 వేల 297 మంది (85. 95 శాతం) పోలింగ్ నమోదైంది. వీరిలో లక్షా 22 వేల 760 మంది పురుషులకు గాను లక్షా 6 వేల 151 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 31 వేల 212 మంది మహిళలకుగాను లక్షా 12 వేల 142 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

చింతలపూడి నియోజకవర్గంలో రెండు లక్షల 73 వేల 069 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 22 వేల 932 మంది (81. 64 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 34 వేల 295 మంది పురుషులకు గాను లక్షా 10 వేల 860 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 38 వేల 733 మంది మహిళలకుగాను లక్షా 12 వేల 050 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నూజివీడు నియోజకవర్గంలో రెండు లక్షల 38 వేల 981 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 10 వేల 155 మంది (87. 94 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 18 వేల 104 మంది పురుషులకు గాను లక్షా 5 వేల 054 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 20 వేల 867 మంది మహిళలకుగాను లక్షా 5 వేల 102 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కైకలూరు నియోజకవర్గంలో రెండు లక్షల 5 వేల 604 మంది ఓటర్లు ఉండగా , వారిలో లక్షా 79 వేల 536 మంది (87.32 శాతం) పోలింగ్ నమోదైంది. వారిలో లక్షా 01 వేల 196 మంది పురుషులకు గాను 89 వేల 384 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, లక్షా 4 వేల 404 మంది మహిళలకుగాను 90 వేల 151 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# అందరి సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ జయప్రదం



రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 15 : బాపట్ల జిల్లా వ్యాప్తంగా సాదారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా వెల్లడించారు. రీపోలింగ్ కు అవకాశం లేకుండా అందరి సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ జయప్రదం చేశామన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి స్థానిక కలెక్టరేట్ లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే గొప్ప సంకల్పంతో ప్రజలు ఓటు వేశారని, అందుకే పోలింగ్ శాతం పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ కు జిల్లాలో ఎలాంటి అవాంతరాలు జరుగలేదన్నారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణకు సమర్థంగా పనిచేసిన ఆర్వోలు, ఏఆర్వోలు, ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా సహకరించిన ఉద్యోగులు, పోలీసులు, మీడియా వారిని అభినందించారు. వేమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 1,70,666 మంది ఓట్లు వేయగా 86.43% పోలింగ్ నమోదయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు. అలాగే రేపల్లె నియోజకవర్గంలోనూ-1,87,673 మంది ఓట్లు వేయగా 82.59% పోలింగ్ నమోదైందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో-1,58,500 మంది ఓట్లు వేయగా 83.02% పోలింగ్ నమోదైందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 2,00,264 మంది ఓట్లు వేయగా 87.32% పోలింగ్ నమోదైందన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 2,15,375మంది ఓట్లు వేయగా 88.25% పోలింగ్ నమోదైందన్నారు. చీరాల నియోజకవర్గంలో 1,67,466మంది ఓట్లు వేయగా 82.61% పోలింగ్ నమోదైందన్నారు. బాపట్ల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో 10,99,944 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 85.15% పోలింగ్ నమోదైందన్నారు. పోలింగ్ రోజున రాత్రి 6 గంటలు దాటిన తర్వాత కూడా 250 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు క్యూలో ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించారు. గత ఎన్నికల కంటే ప్రస్తుతం పోలింగ్ శాతం జిల్లాలో బాగా పెరిగిందన్నారు. స్ట్రాంగ్ రూములకు తరలించిన పోలింగ్ యంత్రాలను అభ్యర్థుల సమక్షంలో సీల్ వేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ వరకు జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని ఆయన కోరారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రక్రియ బాపట్ల జిల్లాలో ప్రశాంతంగా సాగిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా పోలింగ్ జరగ్గా, ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ అనంతరం పోలింగ్ యంత్రాలు సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్ కు చేరాయని, అభ్యర్థుల సమక్షంలో సీల్ వేసే ప్రక్రియ బాగా జరిగిందన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల బయట వైపు మాత్రమే చిన్న ఘర్షణలు జరిగాయన్నారు. పోలీసు బలగాలను తక్షణమే అక్కడకు పంపడంతో నివారించగలిగామని, కేసులు నమోదు చేశామన్నారు. వారికి 41 సెక్షన్ కింద నోటీసులిచ్చామని, 30 కేసులు నమోదు చేసి అందులో 241 మందిని ముద్దాయిలుగా చేర్చామన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుండి లా అండ్ ఆర్డర్ కింద మరో 43 కేసులు నమోదు చేసి, 262 మందిని ముద్దాయిలుగా చేర్చామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద మరో 19 కేసులు నమోదు చేసి, 30 మందిని ముద్దాయిలుగా చేర్చామన్నారు. స్ట్రాంగ్ రూములకు మూడు అంచెల భద్రత కల్పించామన్నారు. భద్రత కోసం అదనపు ఎస్పీని అక్కడ నియమించామన్నారు. సిసి కెమెరాలు, టీవీల నిఘా ఓట్ల లెక్కింపు వరకు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చోట ఎన్నికల సరళి పై నే చర్చ

రాయల్ జర్నలిజం( జే పంగులూరు ) మే 15 : ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూసిన ఎలక్షన్స్ సోమవారంతో ముగిసాయి ఎన్నికలకి ఎలాంటి దుర్ఘటన లు జరగకుండా ప్రశాంతంగా జరగటం పట్ల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు అయితే ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు మంగళవారం నుండి ప్రతి చోట ఎన్నికల సరళి పై నే చర్చ జరుగుతుంది ఎవరు ఎటు చేశారు ఏ వర్గం ఏ పార్టీకి మద్దతుగా నిలిచింది ఎవరికి ఎన్ని ఓట్లు రాబోతున్నాయి ఏ అభ్యర్థి ఎన్ని ఓట్లు మెజార్టీతో గెలుపొందుతున్నాడు అనే అంశాలపై ప్రజలు చర్చించుకుంటున్నారు అద్దంకి నియోజకవర్గంలోని టిడిపి అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ పై వైసీపీ అభ్యర్థిగా పాన్%శీ% చిన్న హనిమిరెడ్డి పోటీ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు తరుపున విపరీతమైన ప్రచారం జరిగింది అభ్యర్థులతో పాటు అభ్యర్థి కుటుంబ సభ్యులు బంధువులు నాయకులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు సుమారు నెలరోజుల పాటు గ్రామాల్లో డీజే సౌండ్స్ సిస్టముతో ప్రచారం హోరెత్తించారు చివర్లో మద్యం ఏర్లు పారించారు చివరి రెండు మూడు రోజుల్లో డబ్బు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేశారు అయినా కూడా ఏ ఓటరు ఏ పార్టీకి ఓటు వేశాడు అర్థం కాని పరిస్థితి నెలకొల్పింది ఓటర్ ల మనస్తత్వం అర్థం కాకపోయినప్పటికీ నాయకులు కార్యకర్తలు అన్నదంటే తమదంటూ లెక్కలు వేసుకుంటున్నారు కచ్చితంగా ఇన్నివేల ఓట్లు మెజార్టీతో తమ అభ్యర్థి బయటపడతాడని ఒక పార్టీ అంటే కాదు తమ అభ్యర్థి ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తాడని మరో పార్టీ నాయకులు చెప్తున్నారు ఇక సామాన్య ప్రజల విషయానికొస్తే అరుగులు మీద రచ్చబండల దగ్గర హోటళ్ల . టీ స్టాల్ చివరికి ఉపాధి హామీ పని దగ్గర కూడా ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని దానిపైన చర్చ జరుగుతుంది సంక్షేమ పథకాల అమలు చేసి పేదలకు అంతో ఎంతో ఉపయోగపడిన జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వటం ఖాయమని వైసిపి అభిమానులు వాదన వినిపిస్తున్నారు అద్దంకిలో ఆ పార్టీ అభ్యర్థి హనిమిరెడ్డి గెలుస్తాడని వాదిస్తుండగా సంక్షేమ పేరుతో అనేక అవక తవకలకు పాల్పడిన జగన్మోహన్ రెడ్డి ఇక ఇంటికేనని టిడిపి సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజల్లోకి వెళ్లిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని టిడిపి మద్దతుదారుల వాదనలు వినిపిస్తున్నాయి అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్ నాలుగోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయటం ఖాయమని నాయకులు .కార్యకర్తలు. అభిమానులుచెబుతున్నారు ఇందులో భాగంగానే ఆ గ్రామాల్లో ఇన్ని ఓట్లు వస్తాయని ఈగ్రామల్లో ఇన్ని ఓట్లు వస్తాయని ఈసారి ఆ గ్రామంలో పలానా పార్టీకి మెజార్టీ తగ్గి పలానా పార్టీ ఓట్లు పెరుగుతాయని లెక్కలు వేస్తున్నారు ఫలానా గ్రామంలో రెండు పార్టీలకు సమానంగా ఓట్లు వస్తాయని కాకి లెక్కలు వేస్తున్నారు గత ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ 13.500 మెజార్టీతో విజయ సాధించాడని ఈసారి కూడా గెలుపు తమదేనని చెబుతున్నారు పేదల ఈసారి వైసీపీకి అండగా నిలబడతారని హనిమిరెడ్డి విజయం సాధిస్తాడని వైసీపీ వర్గాలు లెక్కలు కడుతున్నాయి తెలంగాణ నుంచి విదేశాల నుంచి భారీగా ఆంధ్రప్రదేశ్ కుఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలి వచ్చారని వారిలో 90% ఓటర్లు వేశారని ఆరెండు పార్టీల వారు అందువలన విజయం ఖాయమని అంటున్నారు ఇలా ప్రతిచోట ఓట్ల సరళి గురించి చర్చించుకోవడం జరుగుతుంది పూర్తిగా తెలియాలంటే జూన్ 4 నా ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలబడే వరకు ఇలాంటి ఊహ గానాలు వినాలిసిందే ఎవరు ఎన్ని కాకిలెక్కలు కట్టుకున్న ఓటర్లుతీర్పు నీ కిష్టమైన ఇ.వి.ఎం లు తెరిస్తేనే అభ్యర్థుల భవిష్యత్తు తెలియనున్నది.

# డెంగీ పోస్టర్ ఆవిష్కరణ



రాయల్ జర్నలిజం( రాయచోటి ) మే 15 : జాతీయ డెంగీ దినోత్సవం ప్రతి సంవత్సరవే 16 వ తేదీ అనగా జరుపుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి యన్ కొండయ్య, జాయింట్ డైరెక్టర్ డాక్టర్,దేవ సాగర్,జిల్లా మలేరియా అధికారి బి. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా కార్యాలయం లో డెంగీ పోస్టర్ ఆవిష్కరణ చేసారు జిల్లా వైద్య అధికారి డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ "సమాజ భాగస్వామ్యం తో డెంగీ వ్యాధి నివారిద్దాం.అనే నినాదం తో ప్రజలకు అవగాహనా కల్పిస్తూ డెంగీ వ్యాధి ఈడీస్ దోమ , టైగర్ అడదోమ ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని ప్రతి వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో డెంగీనివారణ, మరియు చికత్స గురించి పూర్తి అవగాహనా ప్రజలకు కల్పిస్తున్నారన్నారు. విపరీతమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి,కంటి నొప్పి,వికారం, వాంతులు,శరీరం పై ఎరట్టి దదర్లు,అలసట, ముక్కుల నుండీ రక్తస్రవం శ్వశ తీసుకోవడం కష్టం,రక్త కణాలు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైదున్ని సంప్రదించాళ్ళన్నారు. అన్ని ప్రాథమిక, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో యన్ యస్ 1 డెంగీ కిట్స్ ద్వారా డెంగీ నిర్ధారణ చేసుకోవచ్చన్నారు. జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ కొరకు నీరు నిలువ ఉన్న ప్రాంతం లో దోమ లార్వ, పెరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, డెంగీ నిర్ధార్ణ అయితే వెంటనే ఆగ్రామల్లో దోమల నివారణకు పైరేత్రియం, స్ప్రేయింగ్, ఫోగ్గింగ్, చేపడుతున్నామాన్నారు, ప్రజలకుడా ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలి, దోమతరులు వాడుకోవాలి, వైద్య సిబ్బంది ప్రతి రోజు గ్రామాల్లో దోమల నివారణకు ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నారు. డ్రైడే ఫ్రైడే ద్వారా ప్రతి శుక్రవారం దోమల పెరుగుకుండా ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు వైద్య అధికారి డాక్టర్ శైలజగారు జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ, మలేరియా సబ్ యూనిట్ అధికారులు వై. ప్రసాద్ యాదవ్, జె జయరామయ్య, సి ఎచ్ ఓ లు నారాయణ, రామకృష్ణ,కె. బలరామరాజు, సరళ, శివారెడ్డి పెంచలయ్య, ఈశ్వరయ్య జిల్లా వైద్య సిబ్బంది పాలుగోన్నారు.

# ఆగంతకులను వెంటనే శిక్షించాలి



రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 15 : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి నిప్పు పెట్టిన ఆగంతకులను శిక్షించాలని తెలుగుదేశం పార్టీ-బిజెపి-జనసేన పార్టీ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ డిమాండ్ చేశారు. పడమర పిన్నిబోయిన వారిపాలెంలో మంగళవారం సాయంత్రం 6:30-7:30 గంటల సమయంలో కరెంటు ఆపి మరి స్వర్గీయ నందమూరితారక రామారావు విగ్రహాన్ని వైసిపి అల్లరి మూకలు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన పై బాపట్ల నియోజకవర్గ టీడీపి, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ 92% రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైన పడమర పిన్నిబోయిన వారిపాలెంలో వైసిపి మూకలు టీడీపి కార్యకర్తలపై భౌతిక దాడులకు తెగపడటం దుర్మార్గమని, నందమూరి తారకరామారావు విగ్రహాన్ని తగులబెట్టడం వైసిపి అరాచక పాలనకు పరాకాష్టగా అభివర్ణించారు. కేవలం నాలుగు దఫాలుగా బాపట్ల నియోజకవర్గంలో ఓడిపోతూ వస్తోన్న టీడీపీ ఈ సారి గెలవబోతోందనే అక్కసుతో ఇలాంటి దుశ్చర్యలకు వైసిపి గూండాలు పాల్పడటం పై మండిపడ్డారు. నర్రా ఏడుకొండలు అనే టీడీపి కార్యకర్తపై వైసిపి గూండాలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని ఆయన గుంటూరు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ కూడా తమ కారుని తామె తగులబెట్టుకుని, మహిళలు తగులబెట్టారని ఆరోపిస్తూ అక్రమ కేసులు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. ఈ గొడవలన్నిటికీ మూలకారణమైన స్థానిక వైసిపి జెడ్ పీటీసి సుదర్శన్ పై రౌడీ షీట్ ఓపెన్ చెయ్యాలని పోలీసులకు ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలను కేవలం ఒక మంచి నాయకుడిని, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజాస్వామ్య బద్ధమైన ప్రక్రియగానే చూడాలి తప్ప, ప్రశాంతమైన పల్లెల్లో అశాంతిని నెలకొల్పకూడదని వైసిపి శ్రేణులకు వేగేశన నరేంద్ర వర్మ హితవుపలికారు.

# బాధిత కుటుంబాలకు బాసటగా ఎమ్మెల్యే ఏలూరి

రాయల్ జర్నలిజం( బాపట్ల ) మే 15 : పసుమర్రు రోడ్డు ప్రమాదంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాసటగా నిలిచారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. 108 వాహనాలకు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను పలు ఆస్పత్రులకు తరలించేలా చొరవ చూపారు. అత్యవసరమైన వారికి ఫస్ట్ ఎయిడ్ చేయించి గుంటూరు చీరాల ఆస్పత్రులు తరలించారు. అర్ధరాత్రి ఒకటిన్నర గంటల నుంచి 15 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు క్షతగాత్రులను పరామర్శిస్తూ బాధితు కుటుంబాలను ఓదారుస్తూ 16 గంటల పాటు నిర్విరామంగా ఆ కుటుంబాలకు పెద్దదిక్కుగా అండగా నిలిచారు. ప్రమాద ఘటనతో ఏలూరి సాంబశివరావు చెలించిపోయారు. ఓటు హక్కు తమ బాధ్యతని, ఓటు వేయాలని ఒక దృఢ సంకల్పంతో రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చి రోడ్డు ప్రమాద రూపంలో మంటల్లో చిక్కుకుని క్షతగాత్రులు కావడం ఆయన మనసును కలచివేసింది. బాధిత కుటుంబాలకు తనున్నానంటూ భరోసా కల్పిస్తూ వారిని ఓదార్చారు. వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని అందించారు.

# ఓటర్ల తీర్పు ఈవిఎంలో నిక్షిప్తం




సామర్లకోట:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెద్దాపురం నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ జరిగినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె సీతారామారావు తెలిపారు.పోలింగ్ రోజున ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి పదునొకండు గంటల వరకు చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటర్లు స్వచ్ఛందంగా క్రమశిక్షణతో తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు కొద్ది సేపు మొరాయించాయి, అయినా తిరిగి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పనిచేయడం ప్రారంభించడంతో పోలింగ్ ఊపందుకుంది. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు సకాలంలో బందోబస్తు చేయకపోవడంతో ఆ పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అదికారి స్వయంగా ఓటర్లను క్యూలైన్లు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎండను సైతం లెక్కచేయకుండా ఏక బిగిన ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం2 లక్షల 15 వేల 095 మంది ఓటర్లు ఉండగా, వీరిలో లక్షా డెబ్బై ఆరువేల 993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ట్రాన్స్ జెండర్ ఓట్లు 13 ఉండగా 8 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 88 వేల,090 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వారి కన్నా అధికంగా 88 వేల, 895 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె సీతారామారావు తెలిపారు. ఓటర్లు ఇచ్చిన ఓటు తీర్పును నిక్షిప్తం చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భారీ బందోబస్తు నడుమ కాకినాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వ విద్యాలయం నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం లో భద్రపరచడం తోపాటు ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించడం జరిగిందని, స్ట్రాంగ్ రూం లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

# తిరుమల కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయల్ జర్నలిజం( లక్కిరెడ్డిపల్లి ) మే 15 : నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి బుధవారం రోజు ఉదయం తన అనుచరులతో కలిసి తిరుమలలో కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న రాయచోటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు బాగా వచ్చి రైతుల సుభిక్షంగా ఉండాలని అలాగే నియోజకవర్గ ప్రజలంతా కులమతాలకు అతీతంగా సుఖసంతోషాలతో ఉండాలని కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని కోరుకున్నానన్నారు.

# జిల్లా కలక్టర్ మరియు ఎస్పి లకు ఘన సన్మానం



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) మే 15 : బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ లను బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, సకాలంలో అన్ని చర్యలు తీసుకొని సమర్థవంతంగా వారు ఎన్నికలను నిర్వహించారని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ఇద్దరు అధికారులు విశేషంగా కృషి చేశారని ఆయన కొనియాడారు. బాపట్ల ప్రజానీకం తరఫున వారిని అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, చిత్రకారుడు జీవి పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ట్రయల్ రన్ విజయవంతం..



హైదరాబాద్ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో అధికారులు రెండు యూనిట్లకు విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఉన్న రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు అధికారులు.దీంతో యాదాద్రి ప్లాంట్ పవర్ జనరేషన్?లో చారిత్రక ఘట్టం మొదలయింది. దశల వారీగా పవర్ జనరేషన్ చేపట్టి త్వరలో గ్రిడ్?కు అనుసంధానం చేయనున్నారు. ఇటీవలే యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో జెన్ కో విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు చేసింది. దీనిలో భాగంగా మొదటి విడతగా 800 మెగావాట్లను ఉత్పత్తి చేసే రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ రెండు యూనిట్లకు సంబంధించిన యాక్సిలరీ బాయిలర్లను లైట్ అప్ చేశారు. ఆ తర్వాత రెండో విడతలో మరో 800 మెగావాట్ల మూడు యూనిట్లతో 24,00 మెగా వాట్లు ఉత్పత్తి చేయనున్నారు. మొత్తంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 4,000 మెగావాట్ల కెపాసిటీతో యాదాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటైంది.ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైటీపీఎస్ పనుల పురోగతిని పరిశీలించిన విషయం తెలిసిందే. వైటీపీఎస్‌లో ముగ్గురు మంత్రులు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లో యూనిట్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉంది? బొగ్గు తరలించే రైల్వే ట్రాక్ నిర్మాణ పురోగతి, గతంలో జరిగిన పనుల బిల్లుల చెల్లింపులు, రానున్న కాలంలో జరగాల్సిన పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై మంత్రులు సమీక్షించారు. ఇంకా ఎంత మందికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది%ా% తదితర అంశాలతో ప్రపంచం మొత్తం హరిత విద్యుత్, పునరుత్పాదక ఇంధనం వైపు దూసుకుపోతుంటే గత పాలకులు థర్మల్ పవర్ పై దృష్టి సారించారు. వివిధ కారణాలతో జాప్యం చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్లాంట్‌లో నైపుణ్యం, నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్లాంట్‌కు అవసరమైన మెటీరియల్ సరఫరా, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థలను త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే ప్రత్యేక పాలసీ తీసుకునేందుకు సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# ఏపీలో రికార్డులు తిరగరాసిన పోలింగ్



అమరావతి : ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన 24 గంటల తర్వాత తుది పోలింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం అర్ధరాత్రి ప్రకటించింది. ఈవీఎంలలో పోలైన ఓట్లను 17ఏ రిజిస్టర్ తో పోల్చి చూసిన తర్వాత ఈ నిర్ధారణకు వచ్చింది.ఈ మేరకు రాష్ట్రంలో ఇప్పటివరకూ గరిష్టంగా 81.76 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ తేల్చింది. ఈవీఎంలలో పోలైన ఓట్లను, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లను కలిపి లెక్కిస్తే ఈ గణాంకాలు తేలాయి.రాష్ట్రంలో తాజాగా జరిగిన ఎన్నికల్లో తుది పోలింగ్ శాతం 80.66 గా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1.1 శాతం మేర నమోదు కావడంతో వీటిని కూడా కలుపుకుంటే మొత్తంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో 81.76 శాతం మేర నమోదు అయినట్లు తేల్చారు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 87.09 శాతం పోలింగ్ నమోదు అయింది. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 68.63 శాతం నమోదైంది.ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదు అయినట్లు గుర్తించారు. తిరుపతి నియోజకవర్గంలో అత్యల్పంగా 63.32 శాతం నమోదు అయింది. అత్యధికంగా ఒంగోలు పార్లమెంటుకు 87.06 శాతం పోలింగ్ నమోదు అయింది. అత్యల్పంగా విశాఖ పార్లమెంటుకు 71.11 శాతం పోలింగ్ నమోదైంది. దీన్ని బట్టి రాష్ట్రంలో పోలింగ్ సరళి ఎలా ఉందనే దానిపై రాజకీయ పార్టీలకు ఓ అంచనా వచ్చింది.ఇప్పటికే రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో పోలింగ్ జరగడంపై రాజకీయ పార్టీలు సంతోషంగా ఉన్నాయి. రాష్ట్రంలో పెరిగిన పోలింగ్ శాతం తమకే మేలు చేస్తుందని అధికార వైసీపీ, విపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ చెప్తున్న నేపథ్యంలో ఈసీ తాజా గణాంకాలు విడుదలయ్యాయి. ముఖ్యంగా ఈసీ అంచనా వేసిన 81 శాతాన్ని మించి పోలింగ్ జరిగినట్లు తేలడంతో ఇది ఎవరిని తేల్చనుందో, ఇంకెవరిని ముంచనుందో అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా పోలింగ్ శాతం పెరిగితే అధికార పార్టీ కంటే విపక్షాలకే మేలన్న అంచనాలుంటాయి. అవి నిజం అవుతాయో లేదో తేలాలంటే జూన్ 4 వరకూ ఆగాల్సిందే.

# కీలక నిర్ణయం తీసుకున్న గూగుల్.. త్వరలో ఆ సేవలు బంద్..!




అమరావతి : టెక్ దిగ్గజం గూగుల్ అధికారికంగా మరో సేవను మూసివేయనంది. గూగుల్ పాడ్ కాస్ట్ యాప్ ను బంద్ చేయనుంది. జూన్ 23నుంచి పాడ్ కాస్ట్ యాప్ షట్ డౌన్ అవుతుందని గూగుల్ ప్రకటించింది.నిర్దిష్ట పాడ్‌క్యాస్ట్‌లకు సబ్‌స్క్రిప్షన్‌లను కలిగి ఉన్న యూజర్‌లు యూట్యూబ్ మ్యూజిక్ కు మారాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది. గూగుల్ వారి సబ్‌స్క్రిప్షన్‌లను ఎగుమతి చేసే ఎంపికతో ఇమెయిల్‌ను పంపడం ద్వారా వినియోగదారులకు తెలియజేస్తోంది.గూగుల్ గత సంవత్సరం యూట్యూబ్ మ్యూజిక్ యాప్‌లో పాడ్‌క్యాస్ట్-సంబంధిత ఫీచర్‌లను ఏకీకృతం చేయడం ప్రారంభించింది. కంపెనీ ఇప్పుడు ఆ పని పూర్తి చేయనుంది. వినియోగదారులు ఇప్పుడు US వంటి మార్కెట్‌లలో ఒక యాప్‌లో సంగీతం, పాడ్‌క్యాస్ట్‌లను యాక్సెస్ చేయవచ్చు, ఇది త్వరలో ఇతర మార్కెట్‌లకు విస్తరించనున్నారు. అయితే గూగుల్ పాడ్ కాస్ట్ యాప్ ఇప్పటికీ యాప్ స్టోర్, ప్లే స్టోర్ లో అందుబాటులో ఉంది.అయితే, వారు జూన్ 23 తర్వాత కంటెంట్‌ని వినియోగించలేరని పేర్కొంది. గూగుల్ పాడ్ కాస్ట్ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్లో 500 మిలియన్లకు పైగా డౌన్‌లోడ్‌లను కలిగి ఉంది. అయితే, ఎడిసన్ నివేదిక ప్రకారం, పాడ్‌క్యాస్ట్‌లను వినియోగించేందుకు 23 శాతం మంది వినియోగదారులు యూట్యూబ్ మ్యూజిక్ యాప్‌ను ఇష్టపడుతున్నారు, కేవలం 4 శాతం మంది వినియోగదారులు పాడ్‌క్యాస్ట్ యాప్‌ను ఇష్టపడుతున్నారు. ఈ మార్పుతో గూగుల్ మొత్తం సంగీత కంటెంట్ వినియోగాన్ని ఒకే ప్లాట్‌ఫారమ్‌లోకి క్రమబద్ధీకరించాలని చూస్తోంది.గూగుల్ యూట్యూబ్ మ్యూజిక్ యాప్‌కి మరిన్ని పాడ్‌క్యాస్ట్-సంబంధిత ఫీచర్‌లను జోడిస్తోంది. ఇందులో ఆర్ఎస్ఎస్ ఫీడ్ కూడా ఉంటుంది. దానితో పాటు, కంపెనీ వినియోగదారులను వారి OPML ఫైల్‌ని డౌన్‌లోడ్ చేసుకోవడానికి కూడా అనుమతిస్తుంది. అయితే ఒక సంవత్సరం పాటు యూజర్ల పాడ్‌క్యాస్ట్ డేటా గూగుల్ టేకౌట్ ద్వారా అందుబాటులో ఉంటుందని కంపెనీ వినియోగదారులకు భరోసా ఇచ్చింది. గూగుల్ పాడ్‌క్యాస్ట్‌ల మాదిరిగానే, యూట్యూబ్ మ్యూజిక్ తో యూజర్లు బ్యాక్‌గ్రౌండ్ ప్లే, డౌన్‌లోడ్ పాడ్‌క్యాస్ట్‌లు వినొచ్చు. ముందుగా ఏప్రిల్ లోనే పాడ్ కాస్ట్ యాప్ ను క్లోజ్ చేస్తామని ప్రకటించారు. కాని జూన్ 23 తర్వాత సేవలు బంద్ చేయన్నారు.

# కోర్టులో ఎన్నికల ఫలితాలు తేల్చుకునేవారు..మాకు హితబోధలా: వెస్టర్న్ మీడియాపై జైశంకర్ ఫైర్



కోల్‌కతా: భారత ఎన్నికలపై దుష్ప్రచారం చేస్తున్న పాశ్చాత్య మీడియా తీరును విదేశాంగ మంత్రి జైశంకర్ కడిగిపారేశారు. ఎన్నికల ఫలితాలను తేల్చుకోవడానికి కోర్టుకు వెళ్లేవారు భారత్‌కు హితబోధ చేస్తున్నారంటూ చురకలంటించారు.దాదాపు రెండు శతాబ్దాల పాటు ప్రపంచంపై బలవంతంగా తమ విధానాలను రుద్దిన దేశాలు ఇంకా ఆ మనస్తత్వాన్ని వదులుకోలేకపోతున్నాయని ధ్వజమెత్తారు. "వై భారత్ మ్యాటర్స్" పేరిట ఆయన రాసిన పుస్తకానికి బంగ్లా ఎడిషన్‌ను విడుదల చేస్తూ మంగళవారం కోల్‌కతాలో ఈ వ్యాఖ్యలు చేశారు.ఆయా దేశాలను ఒక నిర్దిష్ట వర్గం పాలించాలని పాశ్చాత్య మీడియా ఆశిస్తుంటుందని జైశంకర్ అన్నారు. భారత్‌లో అది జరగకపోయే సరికి అసహనానికి లోనవుతున్నారని ఎండగట్టారు. వారు అనుకున్న విధంగానే భారత్ ఉండాలని ఆశిస్తున్నారన్నారు. లేకపోతే దుష్ప్రచారం మొదలుపెడతారని విరుచుకుపడ్డారు. ప్రతిష్ఠను దిగజార్చేందుకు యత్నిస్తారన్నారు. ఇదంతా ఒక 'మైండ్ గేమ్' అని కొట్టిపారేశారు.మండుటెండల్లో భారత్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నారంటూ విదేశీ పత్రిక ఒకటి విమర్శలు చేస్తూ ఇటీవల ఓ కథనం ప్రచురించింది. అంతకుముందు భారత్‌లో ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుతంగా సాగుతాయని ఆశిస్తున్నామని మరికొన్ని మీడియా సంస్థలు అనవసరంగా జోక్యం చేసుకున్నాయి. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలపై ఆంక్షల వంటి అంశాలను ప్రస్తావిస్తూ మరికొన్ని పత్రికలు విమర్శనాత్మక వ్యాసాలను ప్రచురించాయి. ఈ నేపథ్యంలోనే జైశంకర్ తాజాగా వాటికి దీటైన సమాధానమిచ్చారు.

# డీజీపీకి హోంమంత్రి తానేటి వనిత ఫోన్.. టీడీపీ హింసాకాండ మీద చర్యలకు డిమాండ్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా పలు చోట్ల తలెత్తిన హింసాత్మక ఘటనలను ఆమె డీజీపీ దృష్టికి తీసుకొచ్చారు.చంద్రగిరి, గురజాల, తాడిపత్రి, గోపాలపురం తదితర నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన హింసకాండ అంశాలపై డీజీపీతో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యేలపై దాడులు చేస్తుంటే స్థానిక పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీకి ఓటు వేయలేదు అన్న కారణాలతో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల దాడులను స్థానిక పోలీసుల దృష్టికి తీసుకొచ్చినా స్థానిక పోలీసులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు డీజీపీకి తెలిపారు. టీడీపీ దౌర్జన్యాలను హింసకాండను తక్షణమే అడ్డుకోవడంలో విఫలమైతే.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు.దాడులకు పాల్పడ్డ నాయకులను, కార్యకర్తలను చట్టం ప్రకారం వెంటనే అరెస్టు చేయాలని ఆమె కోరారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కచ్చితంగా తెలియజేయాలని డీజీపీని కోరారు. రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ నియమించిన భద్రతా వ్యవహారాల పరిశీలకుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సమాచారం ఉన్నట్లు హోం మంత్రి తెలిపారు. ఎలక్షన్ పోలీస్ అబ్జర్వర్ తీరుతో రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. టీడీపీ వారు ఇచ్చిన ఫిర్యాదులను అడ్డుపెట్టుకుని బాధ్యతారాహితంగా ఎక్కడికక్కడ చేసిన బదిలీల వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని హోంమంత్రి వనిత డీజీపీకి వివరించారు. పట్టపగలు నడిరోడ్డుపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు హింసకు పాల్పడుతుంటే స్థానిక పోలీసులు పట్టనట్లు ఉన్నారని, వారంతా నిబంధనల ప్రకారం వ్యవహరించేలా తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దౌర్జన్యకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను హోం మంత్రి తానేటి వనిత కోరారు.

# ఏపీలో కూటమికి వచ్చే సీట్లు ఇవే..! బుద్దా వెంకన్న జోస్యం..



అమరావతి : ఏపీలో ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓట్ల శాతం కూడా తేలిపోయింది. తాజా ఎన్నికల్లో రాష్ట్రంలో 81.76 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇవాళ ఈసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈసారి గెలుపు ఎవరిదన్న అంశంపై రాష్ట్రంలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.ఇందులో కొందరు వైసీపీకి తిరిగి అధికారం లభిస్తుందని, మరికొందరు లేదు ఎన్డీయే కూటమి కచ్చితంగా గెలుస్తుందని విశ్లేషణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తన జోస్యం చెప్పారు.రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి 130 సీట్లకుపైగా గెలువబోతోందని బుద్ధా వెంకన్న జోస్యం చెప్పారు. పోలింగ్ రోజు అర్ధరాత్రి వరకు ఓటర్లు బారులు తీరడమే దీనికి ఉదాహరణ అన్నారు. ప్రభుత్వంపై ఉన్న కక్షతోనే ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ఓటు వేశారన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు అవసరమని ప్రజలు గుర్తించారని బుద్ధా తెలిపారు. చంద్రబాబు నాలుగోసారి సీఎంగా అమరావతిలో ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన వెల్లడించారు.వైసీపీ ని ఓడించేందుకు నారా కుటుంబం రోడ్డుపైకి వచ్చిందని బుద్ధా వెంకన్న తెలిపారు. మంత్రి బొత్స సతీమణి ఝాన్సీ కూడా ఎంపీగా ఓడిపోతున్నారని ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్ ఛార్జ్ గా ఉన్న బుద్ధా వెల్లడించారు. ఫలితాలు వచ్చేలోపు అధికారులను భయపెట్టాలని మంత్రి బొత్స మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే పోలింగ్ పూర్తయిందని, ఇలాంటి వ్యాఖ్యల వల్ల మారేదేమీ లేదన్నారు.

# దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణం.. రూ.34000 కోట్ల మోసం.. మాజీ డైరెక్టర్ అరెస్ట్

అమరావతి : దేశంలో బ్యాంకింగ్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు పెద్ద ఎత్తున బ్యాంకు మోసాలకు పాల్పడగా, వారిపై కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది.వారు విదేశాల్లో తలదాచుకుని తప్పించుకుని ఉన్నారు. ఇప్పుడు మరో బ్యాంకు కుంభకోణం చోటు చేసుకుంది. 34000 కోట్ల బ్యాంకు మోసం కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధవాన్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ధీరజ్ వాధవాన్‌ను అరెస్టు చేసిన తర్వాత, ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. వాధావన్ 17 రుణ బ్యాంకులతో ఈ మోసానికి పాల్పడ్డాడు. ఇది ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ మోసం. 34,000 కోట్ల విలువైన 17 బ్యాంకుల కన్సార్టియం మోసానికి సంబంధించి సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బ్యాంకుల కన్సార్టియంకు నాయకత్వం వహిస్తోంది. 2022లోనే బ్యాంకు మోసం కేసులో ధీరజ్ వాధావన్ పేరును సీబీఐ ఛార్జ్ షీట్‌లో చేర్చారు. అదే సమయంలో ఇది దేశ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద మోసంగా పరిగణించబడుతుంది. ఇంతకు ముందు కూడా యెస్ బ్యాంక్ కుంభకోణం కేసులో ధీరజ్ వాధవాన్‌ను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం అతను ఈ కేసులో బెయిల్‌పై ఉన్నాడు.

**17 బ్యాంకుల నుంచి మోసం జరిగినట్లు ఆరోపణలు:**డిహెచ్ఎఫ్ఎల్ సిఎండి కపిల్ వాధావన్, డైరెక్టర్ ధీరజ్ వాధావన్ సహా మొత్తం 74 మంది, 57 కంపెనీలపై సిబిఐ న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆఫ్ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసింది.




17 బ్యాంకుల్లో మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఈవో హర్షిల్ మెహతా పేరును కూడా ఛార్జ్ షీట్‌లో చేర్చారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదుపై దాఖలు చేసిన APIR, DHFL కపిల్ వాధావన్, డైరెక్టర్‌గా ఉన్న ధీరజ్ వాధావన్, ఇతర నిందితులతో కలిసి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని 17 బ్యాంకులతో మోసం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొంది. నేరపూరిత కుట్ర చేసి రూ.42,871.42 కోట్ల రుణం ఇవ్వాలని ఈ బ్యాంకులను కోరింది. భారీ మొత్తంలో రుణం తీసుకుని దుర్వినియోగం చేశారు. సీబీఐ ప్రకారం.. జూలై 31, 2020 నాటికి 17 బ్యాంకుల కన్సార్టియం బకాయిల కారణంగా రూ. 34615 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ప్రజ్వల్ రేవణ్ణ కేసులో ట్విస్ట్, అలా చెయ్యడానికి కుదరదని చెప్పిన హైకోర్టు, పిటిషన్ లో!

న్యూఢిల్లీ : హాసన్ జేడీఎస్ పార్టీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసును స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతి మూలిమణి నేతృత్వంలోని ఏక సభ్య ధర్మాసనం విచారించింది.ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు కర్ణాటక హైకోర్టు నిరాకరించింది. రాష్ట్ర హోం శాఖ, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సిట్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సీఐడీ, హాసన్ జిల్లాలోన హొలేనరసీపుర టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, బీజేపీ నేత, న్యాయవాది దేవరాజేగౌడ ప్రతివాదులుగా ఉన్నారు. జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ కేసు విషయంలో ప్రతిరోజు ఏదో ఒక టాపిక్ బయటకు వస్తూనే ఉండటంతో జేడీఎస్ పార్టీ కార్యకర్తలు హడలిపోతున్నారు.పిటిషనర్ తరపున న్యాయవాది జీఆర్. మోహన్ హైకోర్టులో వాదనలు వినిపించారు హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియో కేసులో పలువురు మహిళలు బాధితులుగా ఉన్నారని, అలాగే సాక్ష్యాలను ధ్వంసం చేస్తున్నారని, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో కేసు దర్యాప్తు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన కర్ణాటక హైకోర్టుకు మనవి చేశారు.వాదనలు విన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ఈ కేసు దర్యాప్తు సిట్ చేస్తోందని, అందువలన ఈ కేసు దర్యాప్తు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించడం



కుదరదని చెప్పి విచారణ వాయిదా వేశారు. కేసు నమోదు అయ్యి చాలా రోజులు గడిచాయని, ఫిర్యాదు చేసిన తర్వాత కూడా నిందితుడు ప్రజ్వల్ రేవణ్ణ ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని, పోలీసులు కూడా అతడి ఆచూకీ తెలుసుకోవడం కోసం ప్రయత్నించలేదని, వందలాది మంది మహిళలు బాధితులుగా మారారని ఆరోపించారు.దీనిని తీవ్రమైన కేసుగా పరిగణించి స్వతంత్ర దర్యాప్తు సంస్థకు కేసును అప్పగించాలని, ఈ కేసును నిర్ణీత గడువులోగా నిష్పక్షపాతంగా విచారించి నిందితులను శిక్షించాలని పిటిషన్‌లో కోరారు. ప్రజ్వల్ రేవణ్ణ అదృశ్యం కావడంతో ఈ కేసు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది.

# కొడాలి నాని మౌనానికి కారణమేంటో..?



అమరావతి:దేశ రాజకీయాల్లో ఏపీ రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. దీనిపై సందేహం అవసరం లేదు. దేశంలో ఎక్కడా ఖర్చు చేయనంతగా ఇక్కడ ఓట్ల పండుగకు ఖర్చు చేస్తారనేది అందరికీ తెలిసిన వాస్తవం.తమపై ఉన్న వ్యతిరేకతను కప్పుపుచ్చుకునేందుకు డబ్బును ఆయుధంగా మలుచుకునే పార్టీ ఇందుకు కారణమనే చెప్పాలి. అయితే.. ఈసారి జరిగిన ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో దాదాపు 20 వేల కోట్లు ఖర్చు చేసుంటారనది ఓ అంచనా.. అంతకు మించి కూడా ఉండొచ్చు కూడా. అయితే.. ఈవిషయాన్ని పక్కన పెడితే.. అధికారంలో ఉన్న వైసీపీ పార్టీకి చెందిన ఫైర్ బ్రాండ్‌లలో కొడాలి నాని ఒకరు. అయితే.. ఏపీలో రాజకీయ పరిస్థితులు వారికి వ్యతిరేకంగా ఉన్నందుకో.. లేక.. ఈ ఎన్నికల్లో గెలుపుపై నమ్మకం లేనందుకో తెలియదు గానీ.. సైలెంట్‌గా ఉన్నారు.వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొడాలి నానిని ఓడించాలని ప్రతి టీడీపీ మద్దతుదారు కోరుకునే ఒక నియోజకవర్గం గుడివాడబీ కారణాలు చర్చించాల్సిన అవసరం లేదు. రాజకీయ ప్రత్యర్థులపై దాడి పేరుతో కొడాలి నాని వాడిన భాషని బుద్ధి ఉన్న వారెవరూ అంగీకరించలేరు. అయితే నిన్న స్థానికుల దృష్టిని ఆకర్షించిన విషయం ఏమిటంటే, సాధారణంగా అన్ని పోలింగ్ కేంద్రాలను చురుగ్గా సందర్శించే కొడాలి నాని తన ఇంటికే పరిమితమయ్యారు. అంతేకాదు సాయంత్రం ఓటేసేందుకు బయటకు వచ్చిన ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. జగన్ గురించి, ఆయన పార్టీ గురించి కొన్ని అధికారిక మాటలు చెప్పి ముగించారు.మరోవైపు గుడివాడ సీటును టీడీపీ గెలుపొందడం ఖాయమని టీడీపీ ఎన్నారై అభ్యర్థి వెనిగండ్ల రాముడు ధీమా వ్యక్తం చేశారు. తాము నిర్వహించిన ప్రచారం అత్యంత విజయవంతమైందని, స్థానికులకు నాని బహిర్గతం కావడానికి ప్రధాన కారణమని ఆయన అన్నారు. అత్యంత కీలకమైన పోలింగ్ రోజున ఇలా ప్రవర్తించేలా కొడాలి నాని మౌనంగా ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే.. కొడాలి నాని మౌనం వెనుక ఉన్న అర్థం ఏమిటో ఎన్నికల ఫలితాల తేదీ జూన్ 4 దొరుకుతుండొచ్చు అంటూ.. కొందరు అనుకుంటున్నారు.

# డబ్బులు కుమ్మరిస్తున్న అమెజాన్, భారత ఈ-కామర్స్ వ్యాపారంలో విధ్వంసానికి సిద్ధం




అమరావతి: అమెరికాకు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం జొమాటో పోటీ విషయానికి వస్తే అస్సలు తగ్గేదే లే అంటోంది. వాస్తవానికి భారతదేశంలో విస్తృత వ్యాపారం కలిగిన కంపెనీ పోటీదారు వాల్మార్ట్ తో యుద్ధానికి సిద్ధమని సంకేతాలు అందిస్తోంది.ఈ గ్లోబల్ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తన భారతీయ వ్యాపార సమూహంలో తాజాగా రూ.1,600 కోట్ల మూలధనాన్ని పెట్టుబడిగా పెట్టింది. ఈ-కామర్స్ కంపెనీలు తమ మార్కెట్ వాటాను పెంచుకోవడానికి, నిరంతరం అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో పోటీదారులతో ఒకటిగా ఉండటానికి పోరాడుతున్న సమయంలో అమెజాన్ అవసరమైన నిధులను అందించినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం వెల్లడైంది. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే భారత్లోని తన విభాగమైన అమెజాన్ సెల్లర్ సర్వీసెస్లోకి అమెజాన్ డబ్బును పంప్ చేయడం రెండవసారి కావటం గమనార్హం.ఈ క్రమంలో అమెరికా దిగ్గజం అమెజాన్ స్వదేశీ ఈ-కామర్స్ జైంట్ ప్రత్యర్థి అయిన ఫ్లిప్కార్ట్లో వాల్మార్ట్ 600 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టిన కొద్ది వారాలా తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెజాన్ తాజా పెట్టుబడులకు సమానమైన 166 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను భారత వ్యాపార యూనిట్ నుంచి పొందినట్లు రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం వెల్లడైంది. ఈ షేర్లు అవెజాన్ కార్పొరేట్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, Amazon.com.incs లిమిటెడ్ అందుకున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఎంటిటీ నుంచి రూ.830 కోట్లను అందుకున్న కొన్ని నెలలకే ఇ-కామర్స్ మేజర్ భారతీయ విభాగమైన అమెజాన్ సెల్లర్ సర్వీసెస్లోకి తాజా మూలధన ప్రవాహం వచ్చింది.భారత వ్యాపారంలో తాజా పెట్టుబడి అమెజాన్ ప్రణాళికలకు అనుగుణంగా ఉంది. సియాటిల్ ఆధారిత టెక్ టైటాన్ 2030 నాటికి భారతదేశంలో అదనంగా %వి%15 బిలియన్లు పెట్టుబడి పెడుతుందని అమెజాన్ సీఈవో ఆండీ జాస్సీ వెల్లడించారు. దీంతో ఇండియాలో మొత్తం పెట్టుబడి 26 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుత దశాబ్దం చివరి నాటికి భారతదేశంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెజాన్ వెబ్ సర్వీసెస్ పేర్కొన్న $12.7 బిలియన్ల పెట్టుబడులు ఇందులో భాగంగా ఉన్నాయి.అమెరికాకు చెందిన దిగ్గజ రిటైల్, ఈ కామర్స్ సంస్థలకు చెందిన ఆటగాళ్లు ఫ్లిప్కార్ట్, అమెజాన్లు భారతదేశంలో తీవ్రమైన పోటీలో ఉన్నాయి. పెరుగుతున్న మార్కెట్లలో ఎక్కువ వాటాను పొందాలని వీరు చూస్తున్నారు. ఈ క్రమంలో మాతృసంస్థలు అవసరమైన నిధులను అందించి పెద్ద యుద్ధానికి తెరతీశాయి. ఇదే క్రమంలో రెండు కంపెనీలు ఈ-కామర్స్ వ్యాపారంలో వేగంగా దూసుకుపోతున్న భారతీయ సంస్థ మీషో సైతం 500-650 మిలియన్ డాలర్ల పెట్టుబడిని సమకూర్చుకుంటున్న వేళ పెట్టుబడుల వేడి రాజుకుంది. అమెజాన్ ఇటీవల బజార్ను ప్రారంభించడంతో కొత్త పెట్టుబడి కూడా వస్తుంది. ఇది సాఫ్ట్బ్యాంక్-మద్దతుగల మీషోతో నేరుగా పోటీపడుతోంది.

# నాందేడ్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్‌ఛానల్.. ఓటర్ల కోసం దూసుకెళ్లిన రైలుబండి



అమరావతి: ఓటర్లు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్న రైలు ఆలస్యంగా నడుస్తుండటంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) స్పందించి ఆ రైలుకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయించారు.తద్వారా పోలింగ్ సమయం ముగియడానికి ముందే గమ్యస్థానానికి చేరేలా చూశారు. నాందేడ్-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20812) ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి సోమవారం ఉదయం 9.10 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉన్నా రైల్వే భద్రతా పనుల కారణంగా దాదాపు 7-8 గంటల పైనే ఆలస్యంగా నడిచింది. ఆ రైలులో ఓటింగ్‌కు వస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు 800 మందికి పైనే ఉన్నారు. అయితే రైలును ఎక్కడికక్కడ నిలిపేస్తుండటంతో ఆ ప్రయాణికుల్లో కొందరు ఓ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. రైలు ఆరేడు గంటలు ఆలస్యంగా నడుస్తోందని ఇలాగైతే ఓటువేసే అవకాశం కోల్పోతామని అందులో పేర్కొన్నారు.ఆ వీడియో ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లింది. దీంతో సీఈఓ ముకేశ్‌కుమార్ మీనా స్పందించి విజయవాడ, విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం)లతో మాట్లాడారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగియనుండగా, ఆలోపే రైలును విశాఖకు చేర్చాలని ఆదేశించారు. ఆ ఇద్దరు డీఆర్‌ఎంలు నాందేడ్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు. దీంతో ఆది ఆగాల్సిన రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, దువ్వాడల్లో మాత్రమే ఆగి, మరెక్కడా క్రాసింగ్ లేకుండా సాయంత్రం 5.15 గంటలకు విశాఖపట్నం చేరింది. తద్వారా పోలింగ్‌కు సమయం ఉండటంతో కొందరు ఓటర్లు నగర పరిధిలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కలిగింది. ఇలా గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయకపోతే ఆ రైలు బహుశా రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకునేదని రైల్వే వర్గాలు తెలిపాయి.

# కోవిడ్ వ్యాక్సిన్ తర్వాత శరీరం పనిచేయడం లేదు.. మహిళ కేసు నమోదు




అమరావతి : ఆస్ట్రాజెనాకా వ్యాక్సిన్‌పై మరో మహిళ దావా వేసింది. క్లినికల్ ట్రయల్స్ సమయంలో ఇచ్చిన వ్యాక్సిన్ తనను పూర్తిగా వికలాంగురాలిగా మార్చిందని మహిళ చెప్పింది.ఇప్పుడు ఆమె శరీరం మునపటిలా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సంస్థ వైద్యం అందించడం లేదని ఆరోపించింది. విశేషమేమిటంటే బ్రిటన్‌లో ఇప్పటికే 50 మందికి పైగా ఆస్ట్రాజెనెకాపై దావా వేశారు. 42 ఏళ్ల బ్రే డ్రెస్సెన్ అమెరికాలో ఆస్ట్రాజెనెకా కోవిడ్ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్‌లో పాల్గొన్నారు. 2020 లో విచారణలో పాల్గొన్న తర్వాత.. అతను తీవ్రమైన నరాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ బ్రిటిష్ వ్యాక్సిన్‌ను అమెరికాలో పరీక్షించారు. కానీ ఉపయోగం కోసం ఆమోదించబడలేదు. పరిశోధన ఫలితంగా తగిలిన గాయాల చికిత్సకు కంపెనీ చెల్లిస్తుందని వాగ్దానం చేసిన కంపెనీతో తాను ఒప్పందం కుదుర్చుకున్నానని డ్రెస్సెన్ పేర్కొన్నారు.నవంబర్ 2020 లో వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత.. ఆమె తన శరీరమంతా ముడతలు పడటం ప్రారంభించిందని మహిళ చెప్పింది. దీని తరువాత కూడా అస్ట్రాజెనెకా తన చికిత్స కోసం చేసిన ఖర్చులను చెల్లించలేదు. పెరిఫెరల్ న్యూరోపతితో బాధపడుతున్న తర్వాత తాను పని చేయలేకపోతున్నానని ఆమె వార్తాపత్రికతో చెప్పింది. “నేను వ్యాక్సిన్ కారణంగా నా ఉద్యోగాన్ని కోల్పోయాను. ఇప్పటికీ వైకల్యంతో ఉన్నాను” అని డ్రెస్సెన్ చెప్పారు.

# రఫాలో యుఎన్‌కు పనిచేస్తున్న భారత మాజీ ఆర్మీ అధికారి మృతి

గాజా: ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. హమాస్‌ను తుదముట్టించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ బలగాలు భీకర దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో గాజాలోని రఫా నగరంపై జరిగిన దాడిలో ఐక్యరాజ్యసమితిలో పనిచేసే ఓ భారతీయ మాజీ సైనికాధికారి మృతి చెందారు.యునైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న మాజీ సైనికాధికారి వైభవ్ అనిల్ కాలే(46) తన వాహనంలో రఫాలోని యూరోపియన్ ఆస్పత్రికి వెళ్తుండగా ఈ దాడి జరిగింది. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఆయతో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.గాజాలో ఐక్యరాజ్యసమితి భద్రత మరియు భద్రత విభాగంలో పనిచేస్తున్న భారతీయ పౌరుడి మృతికి ఐక్యరాజ్యసమితి మంగళవారం సంతాపం తెలిపింది . సెక్రటరీ జనరల్ డిప్యూటీ అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ ఒక ప్రకటనలో భారతీయ పౌరుడి మృతికి సంతాపం తెలిపారు.

# టీటీడీ ఆర్జిత సేవలు రద్దు



అమరావతి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా ముగిసింది. నాలుగు గంటల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న వార్షిక వసంతోత్సవాలను దృష్టిలో పెట్టుకుని కోయిల్ అళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించారు అర్చకులు, టీటీడీ అధికారులు.ఈ సందర్భంగా తెల్లవారు జామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. 6 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు.అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి సర్వదర్శనానికి అనుమతి ఇచ్చారు. ప్రతి సంవత్సరం వసంతోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం నాడు పద్మావతి అమ్మవారి ఆలయంలో తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.వసంతోత్సవాల్లో భాగంగా మే 23వ తేదీ ఉదయం 7:45 నిమిషాలకు స్వర్ణ రథోత్సవంపై అమ్మవారు కటాక్షిస్తారు. ఈ మూడు రోజులూ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరిస్తారు.ఈ ఉత్సవాల కారణంగా పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేశారు టీటీడీ అధికారులు. అంకురార్పణ జరిగే మే 21 నుంచి 24వ తేదీ వరకు కల్యాణోత్సవం, సహస్రదీపాలంకారసేవ, మే 23వ తేదీన తిరుప్పావడ సేవ, మే 24 తేదీన లక్ష్మీ పూజ ఆర్జితసేవలను రద్దు చేశారు.

# ఏపీలో భిన్న వాతావరణం: ఉత్తరాంధ్రకు కీలక సూచనలు



అమరావతి : ఏపీలో భిన్న వాతావరణం నెలకొంది. ఒకవంక భారీ వర్షాలు పడుతుండగా.. మరో వంక ఎండ తీవ్రత మళ్లీ మొదటికొచ్చినట్టు కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.వడగాలులు సైతం వీస్తోన్నాయి కొన్ని ప్రాంతాల్లో. పొడి వాతావరణం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు భారత వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.రాయలసీమ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా నమోదైంది. తిరుపతి జిల్లా రేణిగుంట, అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరలో అత్యధికంగా 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా సిద్ధవటంలో 40.3 డిగ్రీల సెల్సియస్ మేర పగటి ఉష్ణోగ్రత రికార్డయింది. ఇదే తీవ్రత మరికొద్దిరోజుల పాటు కొనసాగే అవకాశాలు లేకపోలేదు.విజయనగరం- 12, పార్వతీపురం మన్యం- 10, శ్రీకాకుళం- 9, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు మండలాల్లో నేడు వడగాల్పులు వీస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ మేనిజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. పొడి వాతావరణం ఏర్పడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత పెరగొచ్చు.అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. మంగళవారం నాడు ప్రకాశం జిల్లా కనిగిరిలో 43.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం- 34, ప్రత్తిపాడు- 33, అల్లూరి సీతారామరాజు- గూడెం కొత్తవీధిలో 30 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది.

# టూర్లకు వెళ్తోన్న మంత్రులు, ఎమ్మెల్యేలు..



హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికలు ముగియడంతో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు టూర్లకు వెళ్తున్నారు. ఎన్నికల్లో బిజీగా గడిపిన వారు ప్రశాంతత కోసం విహార యాత్ర, తీర్థయాత్రలకు వెళ్తోన్నారు.కుటుంబంతో కలిసి హాయ్ గా గడిపేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు ఉండడంతో సరదాగా గడిపేందుకు ఇంట్రెస్ట్ చూపుతున్నారు. మరి కొందరు దైవ దర్శనానికి వెళ్తోన్నారు. మంత్రి పొంగులేటి మంగళవారం శబరిమలై వెళ్లారు.మంత్రితో పాటు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు కూడా శబరిమలై బయల్దేరారు. వీరంతా ఎక్కిన ఇండిగో విమానం సాంకేతిక లోపంతో గంటకు పైగా ఎయిర్ పోర్టులో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది బడ్డారు. రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తన కుమారుడి గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా మంగళవారం అమెరికాకు వెళ్లారు.బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ మంగళవారం సరదాగా గడిపారు. యాక్టివ బండిపై అల్లుడిని ఎక్కించుకుని నగరంలో తిరిగారు. ఓ బేకరికి వెళ్లారు. చాలా మంది అభిమానులు బండితో కలిసి ఫొటో దిగారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చేవేళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన బంధువులు, పిల్లలతో సరదాగా గడిపారు. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తన ఫ్యామిలీతో కలిసి తిరుపతి వెళ్లనున్నారు.ఎన్నికల ఫలితాలకు రెండు మూడు రోజుల ముందు మళ్లీ స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఉంది. అటు ఏపీ సీఎం జగన్ దంపతులు తమ కూతురిని చూడడానికి లండన్ వెళ్లనున్నారు. ఫలితాల నాటికి తిరిగిరానున్నారు.

# ఓటు వేయడానికి ఏపీకి వచ్చి.. సజీవ దహనం



అమరావతి : ఏపీలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా చిలకలూరి పేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఆరు మంది దుర్మరణం పాలయ్యారు.పలువురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందిస్తోన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా చీరాల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ప్రైవేటు బస్సు చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలోని ఈవూరిపాలెం వద్ద ప్రమాదానికి గురైంది. పిడుగురాళ్ల- వాడరేవు బైపాస్ రోడ్డు పనుల కోసం కంకరను తీసుకొస్తోన్న టిప్పర్‌ను వేగంగా ఢీ కొట్టింది.ఈ ఘటనలో టిప్పర్‌లో తొలుత మంటలు చెలరేగాయి. వెంటనే బస్సుకూ వ్యాపించాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ అంజితో సహా అయిదుమంది సజీవ దహనం అయ్యారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారిని నీలాయపాలేనికి చెందిన ఉప్పుగుండూరు కాశీ, ఉప్పుగుండూరు లక్ష్మీ, ముప్పరాజు ఖ్యాతి సాయిశ్రీ, చీరాలకు చెందిన బస్సు డ్రైవర్ అంజిగా గుర్తించారు.బస్సులో ప్రయాణిస్తోన్న వారిలో 20 మందికి పైగా గాయపడ్డారు. బస్సు పూర్తిగా మంటలకు అహూతి అయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్సను అందించారు. వారికి ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది.

# Himanta Sarma's big claim on BJP's next move if it wins 400 seats in Lok Sabha

Assam chief minister Himanta Biswa Sarma on Tuesday said that the Bharatiya Janata Party (BJP) would build Krishna Janmbhoomi temple in Mathura and Kashi Vishwanath temple in place of Gyanvapi Mosque in Varanasi after it wins 400 seats in the ongoing Lok Sabha elections.While addressing a poll-bound gathering in Delhi's Laxmi Nagar, Sarma said that the BJP built a grand Ram Janmabhoomi temple in Ayodhya after it got 300 seats in Lok Sabha, now Krishna Janmbhoomi and Baba Vishwanath Mandir would be built iBJP wins 400 seats."When Congress asks us why do you need 400 seats? When we got 300 seats we built the Ram Mandir & now when we get 400 seats Krishna Janmabhoomi will be built and Baba Vishwanath Mandir will also be built in place of Gyanvapi Mosque," he said.The Assam CM hit out at the Congress party, saying that no discussions took place in the Parliament over the issue of Pakistan-occupied Kashmir (PoK) under the grand old party's regime. Sarma asserted that under PM Modi's leadership, PoK would become a part of India."During Congress' rule, no discussions were held in the Parliament regarding PoK...Soon Pak-occupied Kashmir will become part of our country under the leadership of PM Modi..." he added.While addressing another rally in Odisha's Bhubaneswar earlier today, CM Sarma emphasised that there is a need for a Uniform Civil Code (UCC) in the country.The BJP leader said all should be equal in the country. "If a Hindu is allowed to have one wife, why people of other religions can have more than one wife," Sarma said, adding that a Uniform Civil Code is needed in the country."Congress has been trying to give reservation to Muslims...," the Assam CM said, accusing the grand old party of promoting religion-based reservations.He further claimed that Congress has diluted the Constitution, not the BJP. "Congress




frequently speaks about secularism, but there was no mention of the word secularism in the original draft of the Constitution," Sarma said.

## United Nations apologises to India for death of ex-Army officer in Gaza

